ఇంకుడు గుంత నిర్మిస్తేనే అనుమతి

- కొత్త ఇళ్ల నిర్మాణాలకు ఇంకుడు గుంత తప్పనిసరి
- వంద రోజుల ప్రణాళికతో కార్యాచరణ సిద్ధం
- మిర్యాలగూడ పట్టణంలో ఇంటింటి సర్వే

మొత్తం వార్డులు	48
వార్డు ఆఫీసర్లు	28
బిల్ కలెక్టర్లు	05
శానిటేషన్ జవాన్లు	14

మిర్యాలగూడ టౌన్ : అడుగంటుతున్న భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ నూతన భవనం నిర్మించినా ఇంటి ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపడతామని హామీలు ఇవ్వడంతోపాటు మొత్తం స్థలంలో చదరపు మీటరుకు రూ.25 చొప్పున మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం ఇంకుడు గుంత పూర్తయిన తరువాత ఆధారాలు చూపిస్తే ధరావత్ కోసం చెల్లించిన డబ్బులను తిరిగి ఇంటి యాజమానికి చెల్లిస్తారు. ఇంకుడు గుంత నిర్మిస్తామని హామీ ఇస్తేనే నూతన ఇంటి నిర్మాణానికి అధికారులు అనుమతి ఇవ్వనున్నారు.


మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఇంటి వద్ద నిర్మించిన ఇంకుడు గుంత

సర్వే బృందాల ఏర్పాటు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులు ఉండగా వీటి పరిధిలో 26 వేల 667 అసెస్‌మెంటులు ఉన్నాయి. వీటిలో 95 శాతానికి పైగా ఇంకుడు గుంతలు లేని గృహాలు ఉన్నాయి. కాగా వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇంకుడు గుంతలు లేని గృహాలను గుర్తించేందుకు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్‌లు, మున్సిపల్ పారిశుద్ధ్య జవాన్లతో కలిపి సర్వే బృందాలుగా ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ప్రతి ఇంటింటికి వెళ్లి ఇంకుడు గుంతలు ఉన్నాయా..? లేవా..? అనేది పరిశీలిస్తారు. ఇంకుడు గుంతలు లేకుంటే ఇంకుడు గుంతలు కట్టుకునేందుకు 30 రోజుల పాటు గడువు ఇస్తారు. గడువు పూర్తయిన తరువాత ఇంకుడు గుంతలు కట్టుకోకుంటే మున్సిపల్ అధికారులు ఇంటి యాజమానికి నోటీసులు జారీ చేస్తారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తాం



మున్సిపాలిటీలో ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తాం. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టేందుకు మున్సిపల్ బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ జవాన్లతో ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశాం. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకునేలా చూస్తాం.

–జి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

క్లుప్తంగా

బీసీ రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 2019 సంవత్సరంలో అగ్రవర్ణాల పేదల కోసం 103వ రాజ్యాంగ సవరణ చేసి 10శాతం రిజర్వేషన్లను తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు శ్రీనివాస్, పున్నయ్య, రాజు, వెంకన్న, భరత్, నాగేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, జయప్రతాప్, కృష్ణమూర్తి తదితరులున్నారు.

మిర్యాలగూడ తహసీల్దార్‌గా సురేష్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ తహసీల్దార్‌గా సురేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న హరిబాబు కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న డీఏఓ శ్రీనివాసశర్మ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం మాడుగులపల్లి తహసీల్దార్‌గా పని చేస్తున్న సురేష్‌కుమార్ మిర్యాలగూడ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

మాడుగులపల్లి తహసీల్దార్‌గా సరోజపావని

మాడుగులపల్లి : మాడుగులపల్లి తహసీల్దార్‌గా ఎస్.సరోజపావని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సురేష్ మిర్యాలగూడ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లగా, నల్లగొండ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సరోజపావని మాడుగులపల్లికి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

వేధిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : ఎవరైనా వేధిస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు గానీ, షీటీమ్స్‌కు గానీ సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని షీ టీమ్ ఏఎస్‌ఐ తబిత అన్నారు. బుధవారం మండలంలోని అవంతిపురంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నల్లగొండ షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ, భద్రత కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థినులపై, మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడితే పోకిరీలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విద్యాలయం ఉపాధ్యాయులు, బాలికలు తదితరులున్నారు.

ఇందిరమ్మ కాలనీలో కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఆరవ వార్డు ఇందిరమ్మ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు శరత్, నాగునాయక్, గుడిపాటి కృష్ణ, అంజి, బీమేష్ ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

గుర్రంపోడు : మండలంలోని నడికూడ గ్రామానికి చెందిన కట్టెబోయిన చంద్రమ్మ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో చంద్రమ్మ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ఈవిషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆయన రూ.1.60 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి చంద్రమ్మ కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మల వేణుగోపాల్‌రెడ్డి, చింతల శంకర్, నిమ్మల రాజగోపాల్‌రెడ్డి, నిమ్మల రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని ధర్నా

మిర్యాలగూడ అర్బన్ : నాగార్జున సాగర్ ఎడమ కాలువకు సాగు నీరు విడుదల చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఎన్ఎస్పీ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టులో 560 అడుగుల మేర నీరు చేరిందని పైన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు 50వేల క్యూసెక్కులు నీరు వస్తుందని సాగర్ పూర్తిగా నిండే అవకాశం ఉన్నందున ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ రైతు సంఘం నాయకులు పాల్వాయి రాంరెడ్డి, వీరారెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి, రవినాయక్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికై తీసుకోవాలిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీ, విద్యుత్, రోడ్లు తదితర సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఐదు వార్డుల చొప్పున ఆయా కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, చిరు వ్యాపారుల సమస్యలు, రోడ్డు మీద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 2వేల ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు గాను ఇసుక కొరతను నివారించేందుకు స్యాండ్ బజార్ ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నేడు హాలియాలో మాలమహానాడు సమావేశం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): హాలియా పట్టణంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో గురువారం నాగార్జునసాగర్ నియోజకవర్గ మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జంగాల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు.

గురుకులాల్లో ఖాళీ సీట్లు భర్తీ చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : గురుకులాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేయాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేష్, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో లిక్కర్ శాఖకు మంత్రిని కేటాయించిన ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. గురుకులాల్లో ప్రతి చిన్న పనికి గురుకుల సెక్రటరీని కలవాలని ఆర్‌సీఓలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఖాళీగా ఉన్న సీట్లు, బదిలీల విషయంలో ఆర్‌సీఓలకు పరిమితమైన వెసులుబాటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, నాయకులు, సైదానాయక్, సంపత్, న్యూమాన్, మనీ, అనిల్, తరుణ్, కిరణ్, రఘు, కుమార్, వెంకటేశ్, వీరన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేష్

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి


పెద్దవూర పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ

పెద్దవూర: నిత్యం రద్దీగా ఉండే పెద్దవూర మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు దుకాణదారులు సహకరించాలని ఎస్ఐ వై.ప్రసాద్ కోరారు. బుధవారం పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో మండల కేంద్రంలోని కిరాణ, వర్తక దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రం నుంచి నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారితో పాటు, జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి వెళ్తుండటంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుందని తెలిపారు. దుకాణాలలో కొనుగోళ్లకు వచ్చే వినియోగదారులు తమ ద్వి చక్ర వాహనాలను రోడ్లపైనే ఉంచడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిందన్నారు. దుకాణాలకు వచ్చే ప్రజలకు తమ వాహనాలను రోడ్లపై ఉంచకుండా చూసుకోవాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది ఆనందయోగి, కిషన్‌నాయక్, హరిలాల్, రాజు, రాంబాబు, దుకాణదారులు దామోదర్‌రెడ్డి, బచ్చు మనోహర్, శ్రీనివాస్, మల్లిక, సంగారం గిరి, ముసలయ్య పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి మంచినీటి ట్యాంకు ధ్వంసం


ట్యాంకును కూల్చిన దృశ్యం

కొండమల్లేపల్లి : మండలంలోని కేశ్యతండా గ్రామ పంచాయతీలో గల జోగ్యతండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం వాటర్‌ట్యాంకును ధ్వంసం చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గతంలో జన్మభూమి పథకంలో భాగంగా 20 సంవత్సరాల క్రితం జోగ్యతండాలో మంచినీటి ట్యాంకు నిర్మించారు. జోగ్యతండా గ్రామానికి చెందిన రమావత్ రాము, చంద్రకళ పేరున ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలం లేకపోవడంతో ట్యాంక్‌ను కూలగొట్టి ఇదే స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేపట్టాలనుకున్నారు. ఈ విషయాన్ని పలువురు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకురాగా అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ట్యాంకును కూల్చిన వ్యక్తులను ఎందుకు కూల్చారని ప్రశ్నించగా వాటర్ ట్యాంకు మా స్థలంలో నిర్మించారు అందుకోసమే ట్యాంక్ కూలుస్తున్నామని సమాధానం ఇచ్చారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గుండాల వెంకటయ్యను వివరణ కోరగా మంచినీటి ట్యాంకు ధ్వంసం చేసిన మాట వాస్తవమేనని, ట్యాంక్ ధ్వంసం చేసిన రమావత్ రాముపై స్థానిక పోలీస్‌స్టేషన్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కబడ్డీ క్రీడాకారుడు వెంకటేష్‌కు సన్మానం


కబడ్డీ క్రీడాకారుడు వెంకటేష్‌ను సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

హాలియా : పట్టణంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు సూరి వెంకటేష్‌ను అనుముల మండల వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన రాష్ట్ర కబడ్డీ జట్టుకు పలుమార్లు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆలిండియాలో మెడల్స్ సాధించారు. ప్రస్తుతం పోస్టల్ డిపార్ట్‌మెంట్ కబడ్డీ జట్టుకు కోచ్‌గా సూరి వెంకటేష్ వ్యవహరిస్తున్నారు. అదే విధంగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన సూరి వెంకటేష్‌ను ఈ సందర్భంగా పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. సూరి వెంకటేష్ ప్రో కబడ్డీలో తెలుగు టైటాన్స్‌కు కోచ్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో పీడీ వెంకట్రామ్‌రెడ్డి, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఏడుకొండలు, వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబు, నరేష్, చంద్రశేఖర్, రాము, రమేష్, అనిల్, మంగ్యానాయక్, రవి తదితరులు ఉన్నారు.

యాప్‌లో సకాలంలో హాజరు నమోదు చేయాలి

పెద్దవూర: ప్రతి ఉపాధ్యాయుడు మొబైల్ యాప్‌లో సకాలంలో ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నిషన్ సిస్టం) ద్వారా హాజరు నమోదు చేయాలని మండల విద్యాధికారి తరి రాములు సూచించారు. బుధవారం పెద్దవూర మండలంలోని పులిచర్ల, ఊట్లపల్లి ప్రాథమిక పాఠశాలలు, పులిచర్ల జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అయా పాఠశాలల్లో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలు, వంటగది పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా బోధించాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

త్రిపురారం : హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని త్రిపురారం మండల ప్రత్యేక అధికారి లీలా అన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ పరిధిలో గల కస్తూరిబా గాంధీ పాఠశాల, మండల కేంద్రంలోని రాజీవ్ కాలనీలో గల ఎస్టీ మినీ గురుకులాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటకు వినియోగించే పప్పులు, బియ్యం, కూరగాయలు ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలతో పాటు వసతి గృహ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు రోజు వారీగా అందిస్తున్న అల్పాహారం, భోజనం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో నిబంధనల మేరకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఆతర్వాత వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఆర్డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ డానియల్, సీఐ నర్సింహులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ: ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. బుధవారం దేవరకొండ డిపో నుంచి వైజాగ్‌కాలనీకి నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును ఆయన అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసినట్లు గుర్తు చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ప్రతి మారుమూల ప్రాంతానికి రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎం జానిరెడ్డి, డీఎం రమేష్, ఏడీఎం సైదులు, నాయకులు ఆలంపల్లి నర్సింహ, ముక్కమళ్ల వెంకటయ్య, యూనుస్, కొండ్ర శ్రీశైలంయాదవ్, రహత్ అలీ, సర్వయ్య, పున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డిండి: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. డిండి మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ నూత భవనం, కొత్తతండా, పడమటితండా,కాల్యతండాల్లోని నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, సన్నాలకు బోనస్‌గా క్వింటాల్‌కు రూ. 500 కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. అనంతరం చెర్కుపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, శ్రీనువాసులు, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, మైనొద్దీన్, రాఘవేందర్‌రావు, మాణిక్యమ్మ పాల్గొన్నారు.


మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

దేవరకొండ: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సాధికారతకు కట్టుబడి ఉందన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో 4,237 మహిళా సంఘాలకు రూ.3కోట్ల 89లక్షల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాయిని జమున, ఆలంపల్లి నర్సింహ, శ్రీశైలం యాదవ్, యుగంధర్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు తదితరులున్నారు.

16 మంది సారా తయారీదారుల బైండోవర్

త్రిపురారం: హాలియా ఎక్సైజ్ పరిధిలో 16 మంది సారా తయారీదారులపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7న సాక్షిదినపత్రికలో త్రిపురారం మండలం నుంచి 'గుట్టుగా గుడుంబా తయారీ' అనే వార్తా కథనం ప్రచురితం కాగా.. హాలియా ఎక్సైజ్ పరిధిలో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 25 మంది సారా తయారీదారులను గుర్తించి 16 మందిని బైండోవర్ చేయడంతో పాటు 83 లీటర్ల నాటుసారా సీజ్ చేసి, 2050 లీటర్ల పానకం ధ్వంసం చేసినట్లు ప్రకటించారు. 300 కిలోల నల్లబెల్లం, 2 వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

నాగార్జునసాగర్ : యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని నాగార్జునసాగర్ ఎస్ఐ ముత్తయ్య సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలతో అనార్థాలు, సెల్ ఫోన్‌తో సమయం వృథా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపితే చర్యలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి రవాణా చేసిన, సాగు చేసిన, సేవించిన వారి వివరాలు పోలీస్ శాఖకు తెలపాలని, చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే శిక్షార్హులవుతారని అన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలో సెల్‌ఫోన్స్‌తో కాలయాపన చేయవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు వెంకటయ్య, సతీష్‌చంద్ర, గురునాథరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి

దేవరకొండ: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గంలో రెండు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను ఎస్సీలకు కేటాయించాలని కోరుతూ బుధవారం పలువురు ఎస్సీ నాయకులు దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో దాదాపు 50వేల పైచిలుకు ఎస్సీ ఓటర్లు ఉన్నారని, ఇప్పటి వరకు ఎస్సీ సామాజిక వర్గానికి సరైన రాజకీయ అవకాశాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పొట్ట మురళి, అంకూరి నర్సింహ, ఎర్ర కృష్ణ, సైదులు, గోవర్ధన్, భిక్షపతి, చెన్నయ్య, రాములు, ఆంజనేయులు, శివ, నవీన్ ఉన్నారు.


వినతిపపత్రం అందిస్తున్న నాయకులు

సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పోలేపల్లి ఉదయ్‌కుమార్

మిర్యాలగూడ : సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన పోలేపల్లి ఉదయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల దేవరకొండలో నిర్వహించిన పార్టీ 23వ జిల్లా మహాసభలో ఆయనను జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమాలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ అర్బన్ : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బంటు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఇటీవల దేవరకొండ పట్టణంలో నిర్వహించిన పార్టీ 23వ జిల్లా మహాసభలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

త్రిపురారం : విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని సాగర్‌రోడ్డులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సాగర్‌రోడ్డులో ఆర్ 4 లిఫ్టుకు వెళ్లే విద్యుత్ తీగలు తెగిపడి ఉండడంతో అటు వైపుకు మేతకు వెళ్లిన గొర్రెలు తెగిన పడి ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో మూడు గొర్రెలు మృతి చెందాయి. వెంటనే గమనించిన గొర్రెలకాపరులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన శ్రీఈశ్వరి

అడవిదేవులపల్లి : మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన జల్లెడ లక్ష్మినారాయణ-విజయభవానిల కుమార్తె శ్రీఈశ్వరి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీఈశ్వరి అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ 10వ తరగతిలో 553 మార్కులు సాధించింది. శ్రీఈశ్వరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఇన్‌చార్జ్ ఎంఈఓ తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి


పెద్దవూర ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న ఎంఈఓ రాములు

పెద్దవూర: సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈఓ తరి రాములు పేర్కొన్నారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టడం సంప్రదాయం మాత్రమే కాకుండా మహిళల అందాన్ని, ఆధ్యాత్మికతను, శుభసూచికను ప్రతిబింబిస్తుందని అన్నారు. ఒకరికొకరు గోరింటాకు పెట్టుకోవడం వల్ల స్నేహబంధం మరింత బలోపేతం అవుతుందని, శరీరం చల్లబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.లక్ష్మీప్రభ, ఉపాధ్యాయులు వెంకటరమణ, బ్యూలా, నరేందర్, చంద్రమౌళి, సహదేవి, మహేష్, సీఆర్‌పీ పరమేష్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలంలోని చింతలపాలెం గ్రామ శివారులో బుధవారం కొందరు వ్యక్తులు డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న జక్కల చంద్రయ్య, బైరు కాశయ్య, కురిమేటి ప్రభుదాసు, ఆదర్శకుమార్ పట్టుపడగా.. ఎస్‌కే జానీ, మొరం మారయ్య పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.3500 నగదు, 5 సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న స్వీపర్/ స్కావేంజర్ పోస్టుకు మండలానికి చెందిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ తరి రాములు బుధవారం తెలిపారు. అభ్యర్థులు ఏడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు, మండలానికి చెందిన మహిళ అయ్యి ఉండాలన్నారు. ఆధార్ కార్డు, ఏడోతరగతి పాస్ మెమో, బయోడేటా ఫారం పూర్తి చేసి కేజీబీవీలో ఈ నెల 17 నుంచి 19వతేదీ వరకు దరఖాస్తులను అందించాలని సూచించారు.